
### మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం సంచాలకులు ఇ.అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోగా కుల, ఆదాయ, టెట్ మార్కుల జాబితా, విద్యార్హత ధ్రువపత్రాలతో స్థానిక 80అడుగుల రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# దశాబ్దాల కల.. నెరవేరేనా?




హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నది

**వంశధార-బాహుదా నదుల అనుసంధానం ప్రక్రియ కార్యరూపం దాల్చడంలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం నదుల అనుసంధానానికి నిధులు మంజూరు చేసింది. టెండర్లు ఖరారు చేసింది. సంబంధిత సంస్థ పనులు మొదలు పెట్టేందుకు సిద్ధమైంది. కానీ ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులన్నింటినీ రద్దు చేసింది. గత ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంపైనే రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.**

- వంశధార-బాహుదా నదుల అనుసంధానమెప్పుడు?
- టీడీపీ హయాంలో పట్టాలెక్కిన వైనం
- గత ఐదేళ్లుగా వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ప్రస్తుత ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

ఇచ్ఛాపురం/కంచిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వంశధార- బాహుదా నదుల అనుసంధానం హామీలకే పరిమితమవుతోంది. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కక.. ఏళ్ల తరబడి రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ రెండు నదుల మధ్య నిడివి 110 కిలోమీటర్లు. ఈ నదులను అనుసంధానం చేస్తే పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. ఇప్పటికే గొట్టాబ్యారేజీ నుంచి వంశధార ఎడమ కాలువ ద్వారా 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు వరకూ కాలువ విస్తరించి ఉంది. అయితే పలాస నియోజకవర్గంలోని మందస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు మాత్రం వంశధార జలాలు అందడం లేదు. వంశధార-బాహుదా నదుల అనుసంధానంతో ఈ మండలాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇంటర్ లాకింగ్ సిస్టం ద్వారా మహేంద్రతనయ, బాహుదాలకు వంశధారను అనుసంధానం చేస్తే 1.5 లక్షల ఎకరాలకు సస్యశ్యామలం చేసినట్టే. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 మే 6న అప్పటి సీఎం చంద్రబాబు జిల్లావ్యాప్తంగా వంశధార జలాలు అందించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశాలు జారీచేశారు. 2017 అక్టోబరు 10న వంశధార- బాహుదా నదుల అనుసంధానానికి సంబంధించి డీపీఆర్ తయారు చేసేందుకు రూ.5కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 2019 ఫిబ్రవరి 6న ఈ రెండు నదుల అనుసంధానికి సంబంధించి రూ.6,326 కోట్లు మంజూరు చేస్తూ పాలన అనుమతులిచ్చారు. బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. పనులు ప్రారంభించింది కూడా. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. టీడీపీ హయాంలో 25శాతంలోపు పనులను రద్దు చేసింది. కొత్తగా టెండర్లు వేసి పనులు చేయిస్తామని చెప్పిన జగన్ సర్కారు ఐదేళ్ల పాటు ఆ ఊసే ఎత్తలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఈ నదుల అనుసంధానంపై సానుకూల నిర్ణయం తీసుకుంటుందని

(మిగతా 6వ పేజీలో..)



బాహుదా నది

#### అన్నింటా వెనుకబాటే..

రాష్ట్రంలో చిట్టచివరి నియోజకవర్గం ఇచ్ఛాపురం. రాష్ట్రంలో తలసరి ఆదాయం తక్కువగా ఉన్న నియోజకవర్గం కూడా ఇదే. ఇక్కడ జనాభాలో 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారు. కానీ సాగుకు సంబంధించి కనీస వసతులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఉన్న సాగునీటి వనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. మహేంద్రతనయా, బాహుదా నదులు ఉన్నా.. ఎగువన ఒడిశా భూభాగంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో నదుల్లో నీటి లభ్యత లేకుండా పోయింది. అందుకే ఏటా ఖరీఫ్, రబీలో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేలాది రూపాయలు మదుపులు పెట్టిన తరువాత సాగునీరు అందక పంటలు పాడవుతున్నాయి. దీంతో నియోజక వర్గంలో దాదాపు 40వేల ఎకరాల్లో పంట వేయకుండా వృథాగా విడిచిపెడుతున్నారు. ఒక్క నదుల అనుసంధానంతోనే సాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు భావిస్తున్నారు.

## తొలిసారిగా మహిళకు చాన్స్

- నరసన్నపేట ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పోగోటి ఉమామహేశ్వరి



నరసన్నపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కంబకాయి గ్రామానికి చెందిన పోగోటి ఉమామహేశ్వరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో సర్పంచ్‌గానూ, టీడీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1992లో నరసన్నపేట మార్కెట్ కమిటీ ఏర్పాటు కాగా.. ఇప్పటివరకూ అందరూ పురుషులే చైర్మన్లుగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా మహిళకు చైర్‌పర్సన్ బాధ్యత అప్పగించడం గమనార్హం.

- ఉమామహేశ్వరి టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ.. ప్రస్తుతం పార్లమెంటరీ పార్టీ తెలుగు మహిళ కార్యదర్శిగా, గ్రామ పార్టీ అధ్యక్షురాలిగా, బూత్ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆ పార్టీ నేతల అవినీతి అక్రమాలపై మండల సమావేశాల్లో ఆమె ప్రశ్నిస్తూ.. తగిన ఆధారాలతో పోరాటం చేసేవారు. రెబల్ మహిళా లీడర్‌గా గుర్తింపు పొందారు. మండల తెలుగు మహిళా అధ్యక్షురాలిగా, కంబకాయి గ్రామ సర్పంచ్‌గా మూడు పర్యాయాలు పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా సర్పంచుల సంఘం ట్రెజరర్‌గా కూడా ఆమె పనిచేశారు. భర్త అప్పలనాయుడు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేవారు. ఉద్యోగ (మిగతా 6వ పేజీలో..)

## జలుమూరు ఏఎంసీ చైర్మన్‌గా తర్ర బలరామ్



జలుమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తర్ర బలరామ్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామానికి చెందిన బలరామ్ టీడీపీ ఆవిర్భావం నుంచీ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఈయన భార్య మాణిక్యం శ్రీముఖలింగం సర్పంచ్‌గా 2013 నుంచి 2018 వరకు పనిచేశారు. తన సేవలకు గుర్తింపుగా పదవి కట్టబెట్టేందుకు కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. బలరామ్‌కు పదవి దక్కడంపై టీడీపీ నేతలు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పి.రామచంద్రరావు, పి.దాలయ్య, సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, కత్తిరి వెంకటరమణ, ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



దమ్మన్న చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

#### న్యాయం చేయండి

'నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీ గుండువిల్లిపేట వద్ద దమ్మన్న చెరువు ప్రాంతంలో మా పూర్వీకుల నుంచి 40 ఏళ్లుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మూడు ఎకరాల విస్తీర్ణం గల ఈ ప్రాంతంలో 15 రోజులుగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా తవ్వకాలు ఆగడం లేదు' అని దళిత రైతు అప్పలరామయ్య కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కోర్టు ఇంజక్షన్ రిట్ జారీ చేసినా తవ్వకాలు చేపడుతూనే ఉన్నారని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మట్టి మాఫియా!

- చెరువుల్లో అక్రమంగా తవ్వకాలు
- లారీ, ట్రాక్టర్లలో తరలించి విక్రయం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

నరసన్నపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గ్రామాల్లో చెరువులు, కొండ పోరంబోకు స్థలాల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి.. ఇష్టానుసారంగా విక్రయిస్తోంది. ఇదంతా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులకు తెలిసినా.. వారిచ్చే మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రావులవలస, సత్యవరం రూరల్, కరగాం, తామరాపల్లి, నరసన్నపేట పంచాయతీల్లోని చెరువుల్లో గత వారం రోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమార్కులు పగలు, రాత్రివేళ మట్టి, కంకర తవ్వకాలు చేపట్టి.. అక్రమ రవాణా చేస్తున్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ వెంచర్లను చదును చేసేందుకు గానూ చెరువుల్లో మట్టిని తోడేస్తున్నా రు. పొలాలు ఎత్తు చేసేందుకు కూడా ఈ మట్టిని వినియోగిస్తున్నారు.

- నరసన్నపేటలో పలు ప్రభుత్వ పనులకుగానూ తామరా పల్లి శివారు ప్రాంతంలో కొండ పై కంకర, మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. నారాయణవలస, కరగాం, రెడ్డికపేట, గొట్టిపల్లి తదితర గ్రామాల్లో కూడా అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నరసన్నపేట మండలంలో (మిగతా 6వ పేజీలో..)

#### చర్యలు తీసుకుంటాం

రావులవలస పంచాయతీ గుండువిల్లిపేట చెరువు వద్ద మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు అందాయి. తవ్వకాలు నిలుపుదల చేయాలని ఆదేశించాం. ఏ గ్రామంలోనైనా చెరువుల్లో తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామస్థాయిలో వీఆర్వో, వీఆర్ఏలను అప్రమత్తం చేస్తాం.

– సత్యనారాయణ, తహసీల్దార్, నరసన్నపేట

#### లారీ రూ.2వేలు.. ట్రాక్టర్ రూ.500

- రావులవలస పంచాయతీ గుండువిల్లిపేట వద్ద దమ్మన్న చెరువులో భారీ యంత్రాలతో 15 రోజులుగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మట్టిని కోమర్తి, మడపాం, రావులవలస, నరసన్నపేట, రెడ్డికపేట, గొట్టిపల్లి తదితర గ్రామాల్లో ట్రాక్టర్లు, టిప్పర్లతో విక్రయిస్తున్నారు. టిప్పర్ లారీ మట్టికి రూ.2వేలు, ట్రాక్టర్ లోడుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. రోజుకు పదిలోడులకు పైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



హిరమండలంలో పట్టుబడిన ఒడిశా ట్రాక్టర్లు (ఫైల్)

# ఏం పర్లేదు.. ఫైన్ కడతాం

'మీరు దాడులు చేయండి. జరిమానా విధించండి. ఏం పర్లేదు.. డబ్బులు కట్టేస్తాం. ఆ తర్వాత మాదారి మాదే'..

- ఇదీ జిల్లాలో ఇసుక వ్యాపారుల తీరు.

అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని నామమాత్రపు చర్యలతో సరిపెడుతుండడంతో వారి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఫైన్ కట్టేసి మళ్లీ కొత్త మార్గాల్లో ఇసుక తవ్వుకుని పోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు కూడా వీరికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- జరిమానాలకు వెరవని ఇసుక వ్యాపారులు
- డబ్బులు కట్టేసి మళ్లీ అక్రమంగా తరలింపు
- అధికారుల నామమాత్రపు చర్యలే కారణం
- హిరమండలంలో 16 ట్రాక్టర్లు పట్టివేతతో అలజడి
- మళ్లీ కొత్త దారుల కోసం అన్వేషణ

మెళియాపుట్టి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతూనే ఉంది. ఏడు నెలలుగా అధికంగా వంశధార నది నుంచి ఇసుకను విశాఖ, ఒడిశాకు తరలిస్తున్నారు. ట్రాక్టర్లు పట్టుబడితే అధికారులు కొంతమేర (మిగతా 7వ పేజీలో..)





రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



### ప్రకృతి వ్యవసాయ డీపీఎంగా సత్యనారాయణ



శ్రీకాకుళం కలెక్టరేట్/శ్రీకాకుళం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా పూజారి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సోంపేట హబ్‌లో ఏవోగా పనిచేసి డిప్యుటేషన్‌పై శ్రీకాకుళానికి వచ్చారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# పేద విద్యార్థుల కోసం వుయ్ ఫర్ యు




విద్యార్థులకు బ్యాగులు అందించిన సంస్థ ప్రతినిధులు (ఫైల్)



వివేకానంద గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులు

- చదువుకు సాయం అందిస్తున్న సంస్థ
- నిరుద్యోగుల కోసం గ్రంథాలయం
- స్ఫూర్తిదాయకంగా సేవలు

సోంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న ఎంతో మంది పిల్లలకు ఉన్నత చదువులపై ఆసక్తి ఉంటుంది. కానీ ఆర్థిక పరిస్థితులు సహకరించవు. తల్లిదండ్రులదీ అదే పరిస్థితి. బిడ్డలకు ఉన్నత విద్య అందించాలని ఉన్నా.. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి వారికి తోడుగా నిలుస్తోంది సోంపేట కేంద్రంగా సేవలందిస్తున్న 'వుయ్ ఫర్ యు' స్వచ్ఛంద సంస్థ. చదువుకునే స్థోమత లేని విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ సంస్థ సభ్యులు.

### ఆవిర్భావం ఇలా..

సోంపేట పట్టణానికి చెందిన డొంక జోగారావు, లొట్ల పీతాంబరం, బంగారు సతీష్ ముగ్గురూ కలిసి 2008లో పేద విద్యార్థుల కోసం 'వుయ్ ఫర్ యు' సంస్థను స్థాపించారు. మొదటగా ఈ సంస్థ ద్వారా స్వచ్ఛందంగా సేవ చేసేందుకు 14 మంది ముందు కొచ్చారు. వీరంతా నెలకు రూ.100 చొప్పున చందాలు వేసుకున్నారు. ఆ మొత్తంతో కొంతమంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివించారు. దీనిని చూసి.. ఎంతో మంది ప్రేరణ పొందారు. ఫలితంగా రెండో ఏడాదికి సభ్యుల సంఖ్య వందకు చేరుకుంది. ఇలా ఏటా సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఇందులో 264 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా నెలకు రూ.100 చొప్పున చందాలు అందజేస్తున్నారు. దీనిని విద్య కోసం ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉపాధ్యాయులు, వైద్యులు, వ్యాపారులు ఇతర వర్గాలకు చెందిన వారు అధికంగా ఉన్నారు. 2008 నుంచి ఇప్పటి వరకు సుమారు వెయ్యి మంది విద్యార్థులను దత్తత తీసుకొని చదివించారు. ఈ సంస్థ సహకారంతో చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలిచిన ప్రతి ఒక్కరూ సంస్థ సభ్యులుగా చేరి తమవంతు సహకారాన్ని అందిస్తూనే ఉన్నారు.

### ఎంతోమందికి అవకాశం

ఈ గ్రంథాలయంలో చదువుకొని.. బ్యాంకు క్లర్కులు, అధ్యాపకులుగా ఎంపికైన వారు, రైల్వే, ఏపీపీఎస్సీ తపాలా, సచివాలయ, కానిస్టేబుల్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై 40 మంది వరకు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం వీరంతా సంస్థ సభ్యులుగా చేరి మరింతమందికి సాయం అందేలా కృషి చేస్తున్నారు. ప్రముఖ వైద్యుడు ఎస్.రాజేంద్రప్రసాద్ గ్రంథాలయ నిర్వహణ కోసం ఏటా రూ.30వేల వంతున ఇస్తున్నారు. దీంతో పాటు ఇతర దాతల సహకారంతో గ్రంథాలయ నిర్వహణకు రూ.2 లక్షలు, పేదల చదువుల కోసం రూ3.5 లక్షల వరకు ఖర్చు చేస్తోంది వుయ్ ఫర్ యు సంస్థ. రానున్న రోజుల్లో మరింత మందికి సాయం అందించాలనే ప్రణాళికతో ముందుకు వెళుతోంది.

### కల సాకారం



పోటీ పరీక్షల కోసం చదువుకునేందుకు పుస్తకాలను కొనాలంటే రూ. వేలల్లో ఖర్చవుతుంది. వుయ్ ఫర్ యు సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో పోటీ పరీక్షలకు ఎంతగానో తోడ్పడింది. దీంతో ఉద్యోగాన్ని పొందగలిగాను. నాలాగానే ఎంతోమంది ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. భవిష్యత్తులో నావంతు సహకారం అందించి మరింతమంది నిరుద్యోగులకు అండగా నిలుస్తా.

**- ఎన్.రాజశేఖర్, గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్**

### చదవాలనే కోరిక తీరింది



పెద్ద చదువులు చదువుకోవాలన్న కోరిక వుయ్ ఫర్ యు సంస్థతో తీరింది. ఉన్నత చదువులకు నాలాంటి వారికి ఎంతో ఇబ్బంది ఉంటోంది. దీనిని గుర్తించిన వుయ్ ఫర్ యు సంస్థ ఎంతగానో తోడ్పాటును అందిస్తోంది. చదువుకోవాలని ఉన్నా ఆర్థిక స్థోమత లేని వారికి అండగా నిలుస్తోంది.

**- టెంక గణేష్, రైల్వే ఉద్యోగి, కాకినాడ**

### 24 గంటల గ్రంథాలయం

నిరుపేద విద్యార్థులకు విద్యనందించడమే కాకుండా నిరుద్యోగుల కోసం వివేకానంద డిజిటల్ గ్రంథాలయాన్ని కూడా సంస్థ సభ్యులు ఏర్పాటు చేశారు. ఇక్కడ కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో దాతల సహకారంతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. ఇందులో అన్నిరకాల పుస్తకాలు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను దాతల నుంచి సేకరించారు. సంస్థ లైబ్రరీ నుంచే ఉద్యోగాల కోసం నిరుద్యోగుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు పరీక్షలకు సన్నద్ధమయ్యేలా సహకరిస్తున్నారు. నిత్యం వందమందికి పైగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. కొందరు డాక్టర్లు పీజీ ప్రవేశ పరీక్షలకు ఇక్కడే చదువుకుంటున్నారు.

### పేదరికం చదువుకు అడ్డు రాకూడదని..



చదువుకోవాలని ఆశ ఉన్నప్పటికీ ఎంతోమందికి స్థోమత లేక వెనకబడిపోతున్నారు. అలా పేదరికంతో చదువులో వెనకబడిపోకూడదన్న ఉద్దేశంతో 17 ఏళ్ల కిందట వచ్చిన ఆలోచనకు రూపమే వుయ్ ఫర్ యు సంస్థ. ఎందరో ప్రముఖులు తోడు కావడంతో అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయగలుగుతున్నాం. సంఘ సభ్యులు, ఇతరుల సహకారంతో 24 గంటలూ అందుబాటులో ఉండేలా వివేకానంద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో చదువుకొని ఇప్పటికే అధికసంఖ్యలో ఉద్యోగాలు పొందారు. మరింతమంది సహకారంతో పేదల విద్యాభివృద్ధికి తోడ్పడుతూనే ఉంటాం.

**-డొంక జోగారావు, వుయ్ ఫర్ యు వ్యవస్థాపకుడు**



# కట్టెజనుము.. ఆర్థికంగా సాయం

- రబీలో రైతుకు భరోసా ఇస్తున్న పంట

పలాస రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏటా ఖరీఫ్ సీజన్‌లో కుటుంబమంతా శ్రమించి.. వర్షాభావాన్ని.. అతివృష్టిని అధిగమించి..పండించే పంటకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో రబీ పంటగా వేస్తున్న కట్టె జనుము రైతులను కొంతమేరకు ఆదుకుంటోంది. ఖరీఫ్, రబీ, అపరాల పంటల్లో చీడపురుగుల బెడద ఉండడంతో మినుములు, పెసలు వేసినా అంతగా కలసి రావడం లేదు. దీంతో జిల్లా ప్రజలకు కట్టెజనుము వరంగా మారిందని చెప్పవచ్చు. ఎటువంటి ఎరువులు వాడకుండా, తక్కువ ఖర్చుతో లాభాలను తెచ్చిపెడుతుండడంతో దీనిపై అధిక సంఖ్యలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. జనుమును పచ్చి రొట్టగానే కాకుండా ఎండబెట్టి.. పశువులకు గ్రాసం గానూ వినియోగిస్తున్నారు. పలాస మండలంలో 80 ఎకరాల్లో కట్టె జనుము సాగు చేస్తున్నారు. మందస మండలంలో 138 ఎకరాలు, వజ్రపుకొత్తూరులో సుమారు 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మెళియాపుట్టి మండలంలో కూడా 180 ఎకరాలకు పైగా సాగు చేస్తుండడం విశేషం. రబీలో మినుము పంట తరువాత అధికంగా ఈ పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

### భూసారం పెంపునకు..

భూసారం పెంచుకోవడానికి కట్టెజనుము ఉపయోగకరం. రైతులు నికర ఆదాయం పెంచుకోవడంలో భాగంగా మినుము, పెసరను వేయకుండా దీని వైపు అధిక సంఖ్యలో మొగ్గు చూపుతున్నారు. మూడు నెలల కాలంలో అందుబాటులోకి వస్తుంది. ఖరీఫ్‌లో వరికోతకు ఇంకా వారం ఉండగా ఎకరాకు 16 లేదా 17కేజీల గింజలను నానబెట్టి పొలాల్లో చల్లుతారు. చిన్నపాటి వర్షం ఉంటే మరింతగా ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. ఎకరాకు 4 క్వింటాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మందుల పిచికారీ వంటి ఖర్చులు లేకపోవడంతో వేసవిలో రైతులకు ఈ పంట ఆర్థికంగా ఆదుకుంటోంది. ఉత్తర కోస్తా ప్రాంతం వాతావరణానికి ఇది అనుకూలంగా ఉంటుందని... 95 రోజుల నుంచి 105 రోజులలో చేతికి వస్తుందని రైతులు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వీటి కాయలను కోసి ఎండబెడతారు. వారం రోజులు ఎండలో వేయడం ద్వారా పచ్చికాయలు ఎండిపోతాయి. వీటిని ఒకచోట చేర్చి... నూర్పిడి చేసి గింజలు వేరు చేస్తారు. మిగిలిన కాండం భూసారానికి మంచిదని రైతులు చెబుతున్నారు. ఈ గింజలను దాణాగా, పచ్చిరొట్టగా భూసా రాన్ని పెంచేందుకు రైతులు వినియోగించుకుంటున్నారు.

### ప్రభుత్వమే ఆదుకోవాలి

గింజలను ఎండబెట్టి.. వేరు చేసిన అనంతరం వీటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే లాభసాటిగా ఉంటుందని రైతులు అంటున్నారు. దళారులు రైతుల వద్దకు వచ్చి కిలో రూ.60 నుంచి రూ.70 వరకూ కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల సరైన ధర రాక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వమే దీనికి సరైన ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తే తమకు మేలు చేసినట్టవుతుందని రైతులు కోరుతున్నారు.

### ప్రత్యామ్నాయ పంటగా ప్రాధాన్యం



ప్రస్తుత కాలంలో వరితో పాటు ఇతర అపరాల పంటలు ఎన్ని ఉన్నా గిలకలకు (కట్టెజనుము) ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖర్చు తక్కువగా ఉండడంతో లాభాలు వస్తున్నాయి. కొద్దిపాటి కష్టంతో మంచి లాభాలు పొందే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం కట్టెజనుము ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా మారింది.

**- అవుగాన షణ్ముఖరావు, రైతు, మోదుగులపుట్టి, పలాస మండలం**

### సరైన ప్రణాళికతో పండిస్తే మంచి లాభాలు



ఖరీఫ్ పంట చివరిలో.. వరి కోత సమయంలో సరైన ప్రణాళికతో ఈ పంటను వేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది. అందుకే అధిక శాతం రైతులు ఈ పంటపై దృష్టి సారిస్తున్నారు. సరైన ప్రణాళికతో ఈ పంటను వేసి రైతులు లాభాలు పొందవచ్చు. గిరిజన ప్రాంతాల్లో రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు.

**- సవర జోగారావు, రైతు, దానగొర, పలాస మండలం**



### ఒక పండు... రెండు జీడిపిక్కలు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఒక జీడిపండుకు ఒక పిక్క ఉండడం సహజం. కానీ మండలంలోని చినవంక గ్రామానికి చెందిన ఓ రైతు తోటలో ఒక జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఒక పండుకు రెండు కలువ పిక్కలు అరుదుగా కనిపిస్తాయని స్థానిక రైతులు చెబుతున్నారు.

# నేడు కొఠారి చండీమాత యాత్ర

కవిటి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజపురం పంచాయతీ వింధ్యగిరి గ్రామంలో వెలసిన కొఠారి చండీమాత యాత్ర శనివారం జరగనున్నదని గ్రామస్థులు తెలిపారు. ఏటా చైత్ర మాసంలో అశోకాష్టమి సందర్భంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవంగా పేరుగాంచిన ఈ అమ్మవారి ఆలయం చీకటి రాజవంశీయులతో ముడిపడి ఉంది. ఒడిశాలోని చీకటి రాజవంశీకులు తొలిపూజ చేసిన తర్వాతనే ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రకు ఒడిశా వాసులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకోనున్నారు. ఈ ఏడాది యాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు గ్రామస్థులు తెలిపారు.



అలంకరణలో అమ్మవారు

# హమ్మయ్య.. దిగివచ్చిన బంగారం

- 10 గ్రాములకు రూ.1700 వరకు తగ్గిన ధరలు

నరసన్నపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు శుక్రవారం నాడు కాసింత తగ్గుముఖం పట్టాయి. ఇటీవల రోజూ గ్రాముకు రూ.150 నుంచి రూ.200 వరకు పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తగ్గాయి. 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల మీద 1,740 తగ్గి, రూ.91,640కు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారు ఆభరణాలు పది గ్రాముల ధర రూ.1600 తగ్గి, రూ.84 వేలకు చేరింది. ఈ నెల ఒకటో తేదీన 10 గ్రాముల బంగారం ధరలు రూ.2 వేలు పెరగగా.. రెండు రోజుల్లో తగ్గుముఖం పట్టింది. ఈ నెలలో పెళ్లిళ్లు ఉండటంతో కొనుగోలుదారులతో జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, కాశీబుగ్గ, టెక్కలి తదితర పట్టణాల్లోని బంగారం షాపులు కళకళలాడుతున్నాయి.



# నెమళ్లు వచ్చాయోచ్!

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అడవులు... కొండ కోనల్లో కనిపించే నెమళ్లు ఇటీవల కాలంలో తీరప్రాంత గ్రామాలలో గల తోటలలో సందడి చేస్తున్నాయి. అవి గుంపులుగా కనిపిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొండలు అక్రమార్కుల దాటికి కంకర రూపంలో కరిగిపోతుండడంతో నెమళ్ల వంటి పక్షులు నివశించడానికి వీలు లేకుండాపోతోంది. దీంతో తోటలలో సంచరిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆకాశం మేఘావృతమయ్యే సమయాల్లో పురివిప్పుతూ కనువిందు చేస్తున్నాయని అంటున్నారు.

బాతుపురం తోటలలో చెట్టుకొమ్మలపై నెమలి జంట



# మట్టి మాఫియా!

(ఐదో పేజీ తరువాయి)

పలు గ్రామాల్లో కొంతమంది తెలుగుతమ్ముళ్లు మట్టి మాఫియాతో చేతులు కలుపుతున్నారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే.. పెద్దల పేర్లు చెప్పి తప్పించుకుంటున్నారు. మాఫియా సభ్యులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో సంబంధాలు కొనసాగించి అక్రమాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలా మండల పరిధిలో ప్రతిరోజూ గ్రామస్థాయి అధికారులకు మట్టి మాఫియా నుంచి ముడుపులు అందడంతో అక్రమాలు చూసీచూడనట్టు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

# తొలిసారిగా మహిళకు చాన్స్

(ఐదో పేజీ తరువాయి)

విరమణ తర్వాత దంపతులిద్దరూ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. వారి సేవలకు గుర్తింపుగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి రావడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం చేశారు.

- ఉమామహేశ్వరి, అప్పలనాయుడు మాస్టారు మాట్లాడుతూ.. రైతులకు మార్కెట్ కమిటీ సేవలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తమపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎంపీ రామ్మోహన్‌నాయుడు, నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చనకు కృతజ్ఞతలు' అని తెలిపారు.

# దశాబ్దాల కల.. నెరవేరేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలంటూ ఈ ప్రాంత విద్యాధికులు, రైతాంగ ప్రతినిధులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు వరుసగా లేఖలు రాస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే రెండు లక్షల కుటుంబాలకుపైగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ కూడా ప్రత్యేక చొరవచూపాలని కోరుతున్నారు.

### రైతాంగానికి చేయూత..

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో సాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. మహేంద్రతనయా, బాహుదా నదులు ఉన్నా అవి నిర్లక్ష్యానికి గురయ్యాయి. అందుకే వంశధార-మహేంద్రతనయా- బాహుదా నదుల అనుసంధానం చేస్తే ఉద్దానం ప్రాంతానికి మహర్దశ. ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుంది. టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. అందుకే ఇప్పుడు కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**- ఈఏస్ శర్మ, విశ్రాంత ఐఏఎస్ అధికారి**

### ఉద్దానానికి ఊపిరి పోయాలి

ఉద్దానంలో సాగునీటి సమస్య దశాబ్దాలుగా సారవంతమైన నేలలు ఉన్నా సాగునీరు లేకపోవడం పెద్దలోటు. అందుకే వంశధార-బాహుదా నదులను అనుసంధానించి ఉద్దానానికి ఊపిరి పోయాలి. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

**- డాక్టర్ ప్రధాన శివాజీ, వంశధార జలసాధన కమిటీ అధ్యక్షుడు, సోంపేట**

### 13న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దుప్పలవలస అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు.

### పీడీ ఆకస్మిక తనిఖీ

కంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయాన్ని పీడీ కిరణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన అనంతరం అజీవిక, లోకాస్, తదితర ప్రాజెక్టులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలనరసమ్మ, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సేంద్రియ వ్యవసాయం మేలు

కంచిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.ధనుంజయ అన్నారు. అంపురం యూనిట్ బలియాపుట్టుగలో విత్తన గుళికల తయారీ విధానం, దాని ప్రయోజనాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలనరసమ్మ, మండల యాంకర్ శివానందం, ధనలక్ష్మి, రజనీ, పుష్పలత, రోహిణి, మీన తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కవిటి,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):ప్రగడపుట్టుగ జంక్షన్‌లోని గుండమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రగడపుట్టుగకు చెందిన తెలగ కుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

### కుస్తీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఎచ్చెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎండ శివచరణ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈ నెల 5,6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్నాయి. శివచరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

### డ్రోన్ ల్యాబ్ ఆవిష్కరణ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 31 కళాశాలల్లో రూ.50లక్షల విలువ గల డ్రోన్ టెక్నాలజీ (ఏరో విజన్ ల్యాబ్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రొవైడ్ చేసింది. ఇందులో ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలకు కూడా కేటాయించారు. ఈ ల్యాబ్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కమలేష్ పాశ్వన్ శుక్రవారం వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీవీ రమణమూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### రిమ్స్‌లో ప్రత్యేక ఓపీ క్లినిక్‌లు

అరసవల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్)లో ఈనెల 7 నుంచి ప్రత్యేక ఓపీ క్లినిక్‌లను నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి స్పెషలిస్టు వైద్యులతో ఉచితంగా పరీక్ష లు, చికిత్స అందించనున్నారు. 7న మూర్ఛ వ్యాధి, 10న రొమ్ము వ్యాధులు, 11న థైరాయిడ్, 15న హెర్నియా/బీర్జాల వాపులు, 16న పచ్చ కామెర్లు/ కాలేయం, 23న పాదాల వ్యాధులు/ మధుమేహం, 26న పక్షవాతం వ్యాధులకు చికిత్స అందించనున్నారు. సంబంధిత రోగులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు హాజరుకావాలని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం తెలిపారు.

### 13న వాసుదేవరావు స్మారక సభ

కాశీబుగ్గ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటయోధుడు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకుడు పైలా వాసుదేవరావు స్మారక సభ ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పైలా వాసుదేవరావు సంస్మరణ సభ 13న కాశీబుగ్గ అప్పయ్యదొర మార్గ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి మాధవరావు వీరాస్వామి, కుసుమ, ఎం.వినోద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేయండి

టెక్కలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన యంగ్ ఇండియాకే బోల్ జాతీయస్థాయి ఉపన్యాస పోటీలో విజేతగా నిలిచిన టెక్కలికి చెందిన చంద్రశేఖర్ అజాద్‌ను శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆమె అభినందించారు. ఢిల్లీలో శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు అజాద్ ఆమెకు తెలియజేశారు. ఈ సందర్భంగా షర్మిలకు, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయబాను చిబ్, రాష్ట్ర యూత్ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి, రాష్ట్ర యూత్ అధ్యక్షులు లక్కరాజు రామారావు తదితరులకు అజాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## రోగులకు సేవలందించడంలో

# అలసత్వం వద్దు

- సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు నిధులిస్తాం
- ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి జిల్లా నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. వారికి సేవలందించడంలో అలసత్వం వహించవద్దు. ఎటువంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. తొలుత ఓపీ రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎముకల విభాగం ఓపీ వద్దకు చేరుకుని రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? లేదా అని సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్లను పరిశీలించారు. సదరం రిజిస్ట్రేషన్ కేంద్రానికి చేరుకుని రోగులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ఎలా జరుగుతున్నదీ స్వయంగా పరిశీలించారు. అక్కడ తాగునీరు కూడా లేకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే వాటర్ క్యాన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. నీరు సరిపోవడం లేదని సూపరింటెండెంట్ డా.షకీలా చెప్పగా.. వెంటనే అదనంగా బోరు వేయించాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది విషయంలో ఖాళీలుంటే వెంటనే తెలియజేయాలని, అవసరం మేరకు నియామకాలు చేపడతామని అన్నారు. మార్చురీ వద్ద ఫ్లోరింగ్ పూర్తిగా పాడైందని , బాగు చేయడానికి మూడు నెలల సమయం పడుతుందని ఈఈ కలెక్టర్‌కు వివరించారు. సౌకర్యాల కల్పనకు అవసరమైతే నిధులు మంజూరు చేస్తామని, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో అనిత, డీసీఎస్ ఆర్ఎంవో సుభాషిణి, రిమ్స్ ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం, వైద్యులు శ్రీదేవి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సదరం విభాగం వద్ద రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తున్న కలెక్టర్

# శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం

ఆమదాలవలస, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పంచాయతీ పొన్నాంపేటలో శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. శనివారం శ్రీరామ నామస్మరణ, 6న అన్నదానం, 7న శ్రీరామ పాదుకుల పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చల్ల ఉష తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల సింహాచలం, చల్ల కామేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**కోదండ రామాలయంలో పందిరిరాట**

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని పసుపు దంచారు. శనివారం రాములవారిని పెళ్లికుమారునిగా, సీతాదేవిని పెళ్లికుమార్తెగా తయారుచేసే ఉత్సవం ఉంటుందని తెలిపారు. ఆలయ ధర్మకర్త మణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో పందిరిరాట వేస్తున్న దృశ్యం,
ఆమదాలవలస: పొన్నాంపేటలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

**పీఎన్ కాలనీ యోగా సెంటర్‌లో..**

నగరంలోని పీఎన్ కాలనీ యోగా సెంటర్‌లో కరుటూరి నాగలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించారు. సీతారాము విగ్రహాలను పెట్టి కల్యాణం జరిపించారు. మహిళలు కోలాటం, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పొగిరి సుగుణాకర్, యోగా రామారావు, నాగలక్ష్మి, మా ఊరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రేపు శ్రీకూర్మంలో..**

గార, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం దేవాలయం వీధిలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆదిత్యుని కల్యాణోత్సవాలు ప్రారంభం



ధ్వజస్తంభానికి హారతి ఇస్తున్న అర్చకులు

అరసవల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కల్యాణాంగ ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో వై.భద్రాజీ, సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ● సూర్యనారాయణ స్వామిని కేంద్ర ఫిషరీస్ సీఈవో బి.జైకుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ప్రధాన అర్చకులు శంకరశర్మ స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

## సారా నిర్మూలనకు సహకరించండి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నాటు సారా నిర్మూలనకు సహకరించాలని ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ కోరారు. మండలంలోని సన్యాసిపుట్టుగ, డొంకూరులో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. సారా, గంజాయి, ఒడిసా మద్యం రవాణా, వినియోగంపై టోల్‌ఫ్రీ నెంబరు 14405కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోండి

గుజరాతీపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జీఎంఆర్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ విశ్వనాథశర్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. నేటితరం కొత్తకొత్త ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఏఐ టూల్స్, వాటి అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఐ.శ్రీలక్ష్మి, ఎస్.వాణికుమారి, వి.శైలజ,ఎస్.మాధవిలత, ఎస్.పూర్ణిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి కృషిచేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు అన్నారు. శుక్రవారం పొన్నాడలో నిర్వహించిన మండల ఫొటోగ్రాఫర్ల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫొటో గ్రాఫర్ల వృత్తి ఎంతో బాధ్యత కలిగిందన్నారు. సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత వారికి కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఫొటోగ్రాఫర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు ఐవీ రమణ, ఉపాధ్యక్షుడు కొండలరావు, కార్యదర్శి యు.దుర్గబాబు, పైడి బాలారాజు, సువ్వారి చిరంజీవి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే నమస్తే ఎచ్చెర్ల .. మన ఊరికే - మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) తెలిపారు. శుక్రవారం కోష్ట పంచాయతీలో ఆయన పర్యటించారు. రూ.25 లక్షలతో పూర్తి చేసిన వివిధ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యే చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కోష్టలో లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని పలువురు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. దువ్వానిపేటను అభివృద్ధి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అప్పడదొర, పిషిని జగన్నాథనాయుడు, పిషిని లక్ష్మి, లంక శ్యామలరావు, గొర్లె లక్ష్మణరావు, వడ్డాది శ్రీను, దన్నాన మహేష్, పి.అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఈశ్వరరావును సన్మానిస్తున్న కోష్ట గ్రామస్థులు

## బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు లభించాయి. భీమవరంలో శుక్రవారం జరిగిన ఈ పోటీల్లో కవిటికి చెందిన దుదిస్టి మజ్జి 55 కేజీల విభాగంలో ప్రథమస్థానం, శ్రీకూర్మానికి చెందిన ఎస్.వైకుంఠరావు 60 కేజీల విభాగంలో నాల్గో స్థానం సాధించారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు, సీనియర్ బాడీ బిల్డర్ విజయ్‌కుమార్ పతకాలు అందించారు. వారిని జిల్లా అధ్యక్షుడు తారకేశ్వరరావు, కార్యదర్శి కె.గౌరీశంకర్, చీఫ్ ప్యాట్రన్ బాడాన దేవాభూషన్, బి.ప్రసాద్ తదితరులు అభినందించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

నందిగాం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కె.గున్నయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాలక శంకర రావు, వి.కుమారి, పి.వనిత పర్యవేక్షణలో చిన్నారులు నృత్య ప్రదర్శనలుచేశారు. అలాగే వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పుణ్యభూమి నాదేశం పాటను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ఏం పర్లేదు.. ఫైన్ కడతాం

(ఐదో పేజీ తరువాయి)

అపరాధ రుసుం వసూలు చేసి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తర్వాత యథావిధిగా ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. తాజాగా గురువారం హిరమండలంలో 16ట్రాక్టర్లు పట్టుబడడంతో ఇసుకాసురులు ఆందోళన చెందుతున్నారు. ఇక తాము ఎవరిని పట్టుకోవాలని, ఇసుకను ఎలా తరలించాలని కొత్తదారులు వెతుకుతున్నారు. వంశధార నది నుంచి ఒడిశాకు చెందిన సుమారు 25 ట్రాక్టర్లతో నిత్యం ఇసుక తరలిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ రోజూ హిరమండలం నుంచి పాతపట్నం, మెళియాపుట్టి మీదుగా ఒడిశాకు రవాణా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు పట్టుబడకుండా ఇసుక ట్రాక్టర్లకు రెండు కిలోమీటర్లు దూరంలో ముందుగా పైలట్ వాహనాన్ని నడుపుతున్నారు. ఎక్కడైనా తనిఖీలు చేస్తున్నట్టు పైలట్ సమాచారం అందిస్తే.. మరో మార్గంలో ఇసుకను ఒడిశాకు తరలిస్తున్నారు. దీనిపై గత నెల 29న 'పట్టుకోండి చూద్దాం' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. గురువారం రాత్రి హిరమండలంలో వంశధార నది వద్ద తవ్వకాలు చేపడుతున్న 16 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల అపరాధ రుసుం వసూలు చేయాలని భావించారు. దీంతో కొంతమంది ట్రాక్టర్ల యాజమానులు అధికారపార్టీ నేతలను ఆశ్రయించినట్టు తెలిసింది. వారి ఒత్తిడి మేరకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేలు మాత్రమే అపరాధ రుసుం వసూలు చేసి వదిలేశారు. కాగా, ట్రాక్టర్ల యజమానులు అపరాధ రుసుం కడుతున్నా.. ఇసుక అక్రమ తరలింపు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. కొంతమంది అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి.. ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదాలు

ఆమదాలవలస, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగాయి. లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. లొద్దలపేటలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటకు నిప్పు పెట్టారు. 200 శ్రీగంధం చెట్లు, 200 సర్వి, కొన్ని మామిడి చెట్లు కాలిపోయాయని బాధిత రైతు పూజారి శ్రీలత తెలిపారు. సుమారు రూ.10 లక్షలు వరకు ఆస్తినష్టం జరిగిందని లబోదిబోమంటుంది. దీనిపై గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే చేపేనపేట గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బుడితి సాంబమూర్తికి చెందిన బెల్లం క్రషర్ షెడ్ పూర్తిగా దగ్ధమైంది. పక్క పొలంలో ఉన్న పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. షెడ్‌తో పాటు బెల్లం తయారీకి ఉపయోగించే ఐరన్ పెనాలు, క్రషర్ ఇంజిన్ కూడా కాలిపోయిందన్నారు. సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం జరిగిందని సాంబమూర్తి తెలిపారు. ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశామని, వారు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేసినట్లు గ్రామస్థులు చెప్పారు.

## 8న విద్యుత్ సమస్యలపై క్యాంపుకోర్టు

ఆమదాలవలస, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 8న క్యాంప్ కోర్టు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆమదాలవలస ఇండస్ట్రియల్ ఏరియాలోని తొగరాం సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

జి.సిగడాం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా పెంట, టీడీవలస, ఎందువ, నడిమివలస, తదితర గ్రామాల్లోని దేవాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను పోలీసులు శుక్రవారం అమర్చారు. ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను అమర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ వై.మధుసూధనరావు తెలిపారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

- పెంట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

జి.సిగడాం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేషనల్ ఎసెస్సర్ డాక్టర్ పీవీ, డాక్టర్ తపాన్ రంజన్ ప్రదాన్ అన్నారు. పెంట విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం శుక్రవారం సందర్శించింది. జిల్లా నాణ్యత అధికారి మంత్రి రవికుమార్‌తో కలిసి ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు, సీహెచ్‌వో శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిని, ఏఎన్ఎం భవాని, సర్పంచ్ సోనియా ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జూన్‌లో పొందూరు గ్రామదేవత పండగలు

పొందూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పొందూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను జూన్ 15, 16, 17 తేదీల్లో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక పట్టుశాలి కల్యాణ మండపంలో అనకాపల్లి శివకుమార్, కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు సమావేశమై చర్చించారు. పండగ ఖర్చుల కోసం స్థానిక వ్యాపారవేత్త జామి వెంకటరమణ రూ.లక్ష విరాళం ప్రకటించినట్లు ఈవో మోహన్‌బాబు తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీల్లో కావశ్రీ సత్తా

ఆమదాలవలస, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారత తపాలాశాఖ నిర్వహించిన జాతీయ స్థాయి లేఖా రచన పోటీల్లో గాజుల కొల్లివలస వద్ద ఉన్న శ్రీవాణి విద్యానికేతన్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఇ.కావ్యశ్రీ సత్తాచాటింది. ఈ పోటీల్లో సుమారు 8 వేల మంది పాల్గొనగా కావ్యశ్రీ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. శుక్రవారం ఆమెకు శ్రీకాకుళం హెడ్‌పోస్టాఫీస్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు రూ.25వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో ఎస్‌వీ రమణ, పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, బలివాడ నారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికడదాం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టడమే ధ్యేయంగా అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, మహిళా కళాశాల, ఈదుపురం, లొద్దపుట్టి తదితర గ్రామాల్లో కిషోర వికాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిరోధక, బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బాలల హక్కుల ఆవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

# కట్టుకున్నవాడే కడతేర్చాడు

- ఆర్.కరాపాడులో వివాహిత హత్య కేసును ఛేదించిన పోలీసులు
- అనుమానమే కారణం ● భర్తతో పాటు ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

కవిటి/ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల మీనాక్షి హత్య కేసు మిస్టరీ వీడింది. కట్టుకున్నవాడే ఆమెను కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆమెపై అనుమానం పెంచుకున్న భర్త మరో ముగ్గురితో కలిసి పథకం ప్రకారం ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ వివరాలను ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు విలేకరులకు వెల్లడించారు. ఆర్.కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల దిలీప్‌కుమార్, అదే గ్రామానికి చెందిన మీనాక్షిని ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. గత రెండేళ్ల నుంచి మీనాక్షిని దిలీప్‌కుమార్ అనుమానిస్తూ వేధిస్తుండేవాడు. కొద్దిరోజుల కిందట మీనాక్షి గర్భం దాల్చడంతో మరింత అనుమానాన్ని పెంచుకున్నాడు. దీంతో భార్యను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. అందుకు ఒడిశా రాష్ట్రం కేసరపడకు చెందిన ఎం.రవి, విశాఖపట్నంకు చెందిన వి.దాసు, జాడుపూడి ఆర్ఎస్‌కు చెందిన టి.భానుప్రసాద్‌ను సంప్రదించి పథకాన్ని సిద్ధం చేసుకున్నాడు. పథకం ప్రకారం గతనెల 28వ తేదీన రాత్రి మీనాక్షిని సోంపేట ఆసుపత్రికి తీసుకువెళ్లి డాక్టర్‌కు చూపించాడు. అనంతరం తిరిగి ఇంటికి మోటారు సైకిల్‌పై వచ్చేటప్పుడు ఆర్.కరాపాడు రైల్వే గేటు సమీపంలో రవి, దాసు, భానుప్రసాద్‌తో కలిసి దిలీప్‌కుమార్ మీనాక్షిపై ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేశారు. ఈ మేరకు మీనాక్షి భర్తతో పాటు మిగతా ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నం నాయుడు, కవిటి ఎస్ఐ వి.రవివర్మ పాల్గొన్నారు.

## గంజాయితో ముగ్గురి అరెస్టు

కవిటి/ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ కె.వెంకటఅప్పారావు తెలిపారు. వీరినుంచి రెండు కేజీల 140 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ బలియార్ సింగ్‌తోపాటు మోహన్‌దాస్ ప్రదాన్‌ల ఆర్థిక పరిస్థితి బాగోలేక గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. తమ గ్రామాల సమీపంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి వాటిని మహారాష్ట్ర తీసుకొని వెళ్లి అమ్మకం చేయాలని, వచ్చిన సొమ్మును ఇద్దరు పంచుకోవాలని నిర్ణయించారు. దీనికోసం మహారాష్ట్రలోని ఉస్మాన్‌బాద్‌కు చెందిన గంజాయి వ్యాపారం చేసే షాహాజీ రామజాదవ్‌తో గతంలో ఏర్పడిన పరిచయం మేరకు ఆయన్ను సంప్రదించారు. ఈ మేరకు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి ఇచ్ఛాపురంలో రామజాదవ్‌కు అప్పగిస్తుండగా ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

### సారాతో ఇద్దరు..

సోంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న సోంపేట మండలం జీడిపుట్టుగకు చెందిన లోకనాథం, కవిటి మండలం ఎలమంచి పుట్టుగకు చెందిన సూరయ్యను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ జీవీ రమణ తెలిపారు. లోకనాథం నుంచి 10 లీటర్లు, సూరయ్య నుంచి 8 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరికి సారా సరఫరా చేసిన శారదాపురానికి చెందిన పిన్నింటి చంద్రయ్య, కాకర్లపుట్టుగకు చెందిన కాకర్ల సోమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సుజాత పాల్గొన్నారు.

## చెరువులో గుర్తు తెలియని మృతదేహం

గార, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడాడ చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ఎస్ఐ ఆర్.జనా ర్దనరావు తెలిపారు. ఈ మృతదేహం పురుషుడిదిగా గుర్తించామని, సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పేకాటరాయుళ్లపై కేసు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యరగాం పంచాయతీ పరిధిలోని జీడి తోటల్లో శుక్రవారం పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.2,090 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

### దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట సర్పంచ్ ఎం.దివాకర్ నాయుడు, కేజీబీవీ పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ ఇజ్జురాతు కృష్ణారావుతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమవతి తెలిపారు. గ్రామంలో తాగునీటి కుళాయిల మరమ్మతులను సర్పంచ్ చేయిస్తుండగా కృష్ణారావుకు, సర్పంచ్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. దాడికి పాల్పడ్డారని ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రెండు కార్లు ఢీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీ కొయ్యరాళ్ల జంక్షన్ సమీపంలో శుక్రవారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ బాలికకు గాయాలయ్యాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన వి.నర్సింహమూర్తి కారులో శ్రీకాకుళం వైపు వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న ఒడిశాకు చెందిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ముందు కారులో ఉన్న బాలికకు గాయాలయ్యాయి. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు అందింది.


## వైసీసీ నాయకుడిపై దాడి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండపల్లి గ్రామానికి చెందిన వైసీసీ నాయకుడు పిట్ట మామయ్యపై ఇద్దరు వ్యక్తులు గురువారం సాయంత్రం దాడి చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న మాంసం దుకాణం వద్ద తన పరిచయస్తులతో మాట్లాడుతుండగా, బెల్లుపడ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు తనతో గొడవ పడి ముఖం, చేతులపై పిడిగుద్దులతో గాయపరిచినట్లు మామయ్య శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముకుందరావు తెలిపారు.

## మహిళలు రాజకీయాల్లో రాణించాలి

- ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష

ఒడిశా



ఎమ్మెల్యే శిరీషకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ప్రత్యేకత సాధిస్తున్నారని, రాజకీయ రంగంలో కూడా రాణించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీలో శుక్రవారం నిరహించిన నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి వాటిని పరిష్కరించే దిశలో మహిళలు పాటుపడాలన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. మన జీవితంలో ఎదురైన సమస్యలను పోరాట పటిమతో ఎదుర్కోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమెను విద్యార్థినులు సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ ముక్తికాంత మిశ్రా, డాక్టర్ డీఎస్ రావు, డాక్టర్ అనితపాత్రో తదితరులు పాల్గొన్నారు.

# రహదారులు అభివృద్ధికి చిహ్నాలు: మంత్రి అచ్చెన్న



టెక్కలి: శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే రహదారులు ఆ ప్రాంత అభివృద్ధికి చిహ్నాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రూ.1.43 కోట్లతో నిర్మించనున్న టెక్కలి-భగవాన్‌పురం రహదారి పనులకు టెక్కలిలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడైనా కొత్తగా రోడ్డు నిర్మాణం పనులు జరిగాయా అని ప్రశ్నించారు. ఎప్పుడైనా రోడ్డు విస్తరణ పనులు జరిగాయంటే అది టీడీపీ హయాంలోనే సాధ్యమన్నారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి తొలుసూరుపల్లి రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలన్నారు. ఇప్పటికే ఉపాధి నిధులతో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇంకా ఎక్కడైనా రోడ్లు అవసరమైనా ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేస్తామన్నారు. భగవాన్‌పురం నుంచి టెక్కలి వరకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, టీడీపీ నేతలు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయకుడు, హనుమంతు రామకృష్ణ, మట్ట సుందరమ్మ, కోళ్ల లవకుమార్, కోళ్ల కామేసు, లాడి శ్రీనివాస్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మామిడి రాము, దోని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యం

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి-అమలాపురం, శ్రీకాకుళం, విశాఖపట్నంలకు నూతనంగా మంజూరైన నాలుగు ఆర్టీసీ బస్సులను స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.

### రూ.420 కోట్లతో ఇంటింటికి తాగునీరు

సంతబొమ్మాళి/కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.420 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి చెట్లతాండ్ర-టెక్కలి, సంతబొమ్మాళి-కోటబొమ్మాళి రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వంశధార రిజర్వాయర్ నుంచి నీటిని కోటబొమ్మాళి మండలం కొత్తపేట కొండపైకి తీసుకువచ్చి, అక్కడ ట్యాంక్‌లు కట్టి... కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. రెండేళ్లలో టెక్కలి నియోజక వర్గాన్ని స్వర్ణ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. బోరుభద్ర-నౌపడ, వడ్డితాండ్ర-రావివలస, డీజీపురం-చెట్లతాండ్ర, టెక్కలి రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరిస్తామన్నారు. రాష్ట్రంలో 17వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, ఎల్.ఎల్.నాయుడు, బాడాన వెంకటరమణమ్మ, సర్పంచ్ పంగ అశిరినాయుడు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి: ఎమ్మెల్యే గౌతు శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): అన్ని వేళలా రోగులకు మెరుగైన, అత్యవసర వైద్య సేవ లు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి మానవతా దృక్పథంతో సేవలందించాలని కోరారు. ఆసుపత్రి సమస్యలను సూపరింటెండెంట్ యు.స్వరాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులుగా యేర్పుల జోగారావు, సాలిన భీమారావు, మల్లేన సుశీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైద్యులు జోగినాయుడు, ఐశ్వర్య, షన్ముఖరాజు, జ్ఞానేశ్వరి, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్య బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే బగ్గు



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర'లో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తరగతులను నిర్వహించడంతో పాటు నూతన సిలబస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా సిలబస్‌ను మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగా రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, బోయన ఆనంద్, జామి వెంకట్రావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## భూ సర్వేలో తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు



సర్వేయర్, వీఆర్వోలను మందలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

కొత్తూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భూ సర్వేలో అక్రమాలకు తప్పిదాలకు పాల్పడిన వరిపై చర్యలకు నివేదికను ఉన్నతాధికారులకు పంపామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం కొత్తూరులో భూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువుర రైతులు మాట్లాడుతూ.. కొత్తూరు, కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో జరిగిన భూ సర్వేలో సచివాలయ సిబ్బంది అక్రమాలకు పాల్పడి ఒకరి భూములు ఇంకొకరి పేర నమోదు చేసి తీవ్ర క్షోభకు గురి చేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ.. భూ సర్వేలో తప్పిదాలకు పాల్పడిన కర్లెమ్మ సచివాలయ వీఆర్వో, సర్వేయర్, మండల రీ సర్వే డీటీలపై చర్యలకు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపామని, వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన అక్రమాలను నెల రోజుల్లోగా సరిచేసి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతులు భూములు సరి చేసేందుకు మ్యుటేషన్‌కు పెట్టుకుంటే ఆరు నెలలైనా ఎందుకు సరి చేయలేదని సచివాలయ సర్వేయర్ గిరిరాజు, వీఆర్వో విజయబాబులను ఆయన మంద లించారు. ఆకులతంపర ర్యాంపు నుంచి రాత్రి వేళ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా సచివాలయ సిబ్బంది నివారించడం లేదని విలేకరులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని ఆర్డీవో తెలిపారు.

## శర్మ కమిషన్ రిపోర్టు ఆమోదం ఆనందదాయకం

- సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం

నరసన్నపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగమ కులాలను ఎస్సీల్లో చేర్చేందుకు గాను జేసీ శర్మ కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపడంపై ఆ కుల సంఘ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభి షేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోతు బంగారయ్య మాట్లాడుతూ.. 2008 నుంచి కులానికి గుర్తింపు లేక అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. ఎన్నికలకు ముందు ఎస్సీల్లో చేర్చాలని చంద్రబాబుకు మొరపెట్టుకోగా ఆయన స్పందించి అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీఎ కేటగిరీలో చేర్చడంపై ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించి బేడ, బుడగ జంగాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమలో ఆ సంఘ నేతలు ఐ.వైకుంఠరావు, బద్రి, పి.బలరాం పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

## శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఊడికలపాడు గ్రామం శ్రీరామ క్షేత్రంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయ ధర్మకర్త సనపల కరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారి తిరువీధి నిర్వహించారు. అనంతరం వేద పండితుడు నుసరాపు చంద్రశేఖర శర్మ నేతృత్వంలో స్వామికి చక్రతీర్థ స్నానం చేయించారు. సాయంత్రం సుమారు 200 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా నీటి సదుపాయం, మజ్జిగను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### అభయాంజనేయస్వామి ప్రతిష్ఠోత్సవాలు..

జలుమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దరివాడలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం ప్రారంభ మయ్యాయి. పురోహితుడు ప్రతాప్ శర్మ నేతృత్వంలో దీక్షాధారణ, రుత్విక్ వరుణ, యజ్ఞ సంకల్పం నిర్వహించారు. సాయంత్రం తిరువీధి చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా సీతారాముల కల్యాణం

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తురకపేట అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వేదపండితుడు వేమకోటి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకం అనంతరం విశేష హోమాలు చేపట్టారు. సాయంత్రం అభయాంజనేయ స్వామివారి తిరువీధి చేపట్టారు.

### రేపు శ్రీరామ నవమి వేడుకలు

జలుమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని శ్రీరామ మందిరాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హరికృష్ణమ్మపేట, లింగాలవలస, ఊడిగలపాడు, లింగాలపాడు, తాళ్లవలస, జలుమూరు, అచ్యుతాపురం, మాకివలస, తదితర గ్రామాల్లోని శ్రీరామ మందిరాలను సిద్ధం చేశారు.

## గ్యాస్ లీకై సిలిండర్‌కు మంటలు



హిరమండలం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చిన్నకోరాడ వీధిలోని దేవరశెట్టి శ్రీనివాసరావు ఇంట్లో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అతని భార్య భయంతో బయటకు పరుగులు తీసింది. వీధి సమీపంలో హోటల్ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు వెంటనే ఇంటికి వచ్చాడు. మంటలకు ఇల్లంతా పొగవ్యాపించడంతో వెంటనే కొత్తూరు అగ్నిమాపక శాఖ కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. గ్యాస్ ఏజెన్సీకి సమాచారమిచ్చాడు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొత్తూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికే మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి.

## పశుసంవర్ధక శాఖ గేటుకు తాళం

- తపాలా కార్యాలయానికి వెళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు



గేటుకు తాళాలు వేయడంతో బయట ఉన్న ప్రజలు

టెక్కలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి తపాలా కార్యాలయానికి పశుసంవర్ధక శాఖ కార్యాలయం గేటు నుంచే వెళ్లాల్సి ఉంది. అయితే సదరు కార్యాలయం గేటుకు సిబ్బంది తాళం వేయడంతో ఆధార్ నమోదు, ఇతర సేవల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశుసంవర్ధక సిబ్బంది తీరుపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి, ఇప్పటికైనా అధికారులు స్పందించి తపాలా కార్యాలయానికి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

## చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్ కుమార్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను తల్లిదండ్రులు వెలికితీసి వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలని మోటివేషనల్ స్పీకర్, అంతర్ముఖి సీఈవో డాక్టర్ మాకేన్ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం పూండి సాయివినీత్ విద్యా సంస్థల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు 'ఆర్ట్ ఆఫ్ పెరెంట్స్' అనే అంశంపై అవగాహన కలిగించారు. సెల్ ఫోన్‌కు బానిసలై విద్యకు దూరమవుతూ మానసిక రుగ్మతలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల పిల్లల ప్రవర్తనను పసిగడుతూ వారితో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ చాపర కోదండరావు, విశ్రాంత డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లీల, ప్రిన్సిపాల్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కొత్తూరు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మదనాపురంలో శుక్రవారం మధ్యాహ్నం పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు 10 మందిని గాయపరిచింది. పిచ్చికుక్క ఎక్కడ నుంచి వచ్చిందోకాని గ్రామంలో ఆరుబయట కూర్చున్న వృద్ధుల చేతులు, కాళ్లపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారిలో జంక హాసిని(4) జంక లక్ష్మి, జంక మురళీ, అగతముడి కృష్ణారావు, శ్రీరామ ఆదిలక్ష్మి, మరో ఐదుగురున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆ కుక్కను వెంబడించి తరిమారు. గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

## బీసీ రుణాలకు తరలివచ్చిన అభ్యర్థులు

పలాస, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాల కోసం అభ్యర్థులు భారీసంఖ్యలో తరలివచ్చారు. మునిసిపాలిటీకి సంబంధించి 31 వార్డులకు గాను 52 మందికి రుణాలిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో 800 పైగా దరఖాస్తులు వచ్చాయి. వీరికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం కార్యాలయంలో పరిశీలించారు కమిషనర్ ఎస్.రామారావు మాట్లాడుతూ.. త్వరితగతిన రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## న్యూస్ బాక్స్

### భగవద్గీత శ్లోకాల పోటీ

పాతపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీగిరిపై ధ్యానమందిరంలో వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఎంవీ కృష్ణమాచార్యులు, రాజు వ్యవహరించినట్లు నిర్వాహక ప్రతినిధి తారకేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు భక్తి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

### బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పాతపట్నం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాతపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు వడ్డాది తిరుపతిరావు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా గేవెల సూర్యం, ఉపాధ్యక్షుడిగా ఎస్.రవికుమార్ జనరల్ సెక్రటరీ గా మద్దిల రమణ, జాయింట్ సెక్రటరీగా లుకలాపు యుగంధర్, స్పోర్ట్సు సెక్రటరీగా సీహెచ్ రామకృష్ణ, కోశాధికారిగా పడ్డాన అప్పల నాయుడు తదితరులను ఎన్ను కున్నారు.

### నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రామాభివృద్ధి సంఘ నిధులను సర్పంచ్ జీరు బాబూరావు దుర్వినియోగం చేశారని గ్రామస్థులు శుక్రవారం నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయంలో గ్రామ సంఘానికి వచ్చిన డబ్బులు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జీరు భీమారావు ఆధ్వర్యంలో గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా టెక్కలి సీఐ శ్రీనివాసరావు, నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి మాట్లాడుతూ.. శనివారం సర్పంచ్ బాబూరావుతో ఖర్చు చేసిన నిధులు, నిల్వ నిధుల లెక్కలు చెప్పిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

### కంకర రవాణాకు పన్ను

పలాసరూరల్,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పలాస రెవెన్యూ బొడ్డపాడు ఎంఐజీ లేఅవుట్ పనులకు సుడా అధికారులు తరలిస్తున్న అదనపు కంకర రవాణాకు మైన్స్ వారికి సీనరీ చార్జీలను చెల్లించాలని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని తహసీల్దార్ ఎన్.కల్యాణచక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సుడా అధికారులు వెలికితీసిన కంకరకు పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

### న్యాయ సేవలపై ప్రజలకు తెలియజేయాలి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్న సేవలపై మారుమూల గ్రామాల ప్రజలకు పత్రికల ద్వారా తెలియజేయాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రసన్నలత అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టు ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను గ్రామాల్లోని ప్రజలకు తెలియడం లేదన్నారు. మే 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పార్టీ పటిష్ఠతకు చర్యలు

టెక్కలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన టెక్కలి మండల వైసీపీ కార్యవర్గ సమావేశం నిర్వ హించారు. టీడీపీ చేస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరరావు, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్ పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ గుడ్ల ఆనంద్ మృతి

టెక్కలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు గుడ్ల ఆనంద్ (80) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టీడీపీలో గతంలో ఈయన క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆనంద్ మృతిపట్ల వైశ్య సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

### సారా నిర్మూలనకు సహకరించండి

హరిపురం ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు వ్యాపారులు సహకరించాలని ఎక్సైజ్ సీఐ బేబీ కోరారు. ఎక్సైజ్ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కిరాణా వ్యాపారులు తహసీల్దార్ హైమవతిని కోరారు. ఈ నేపథ్యంలో స్థానికంగా కిరాణా వ్యాపారులతో మందస వైశ్య సంఘం భవనంలో తహసీల్దార్ హైమవతి, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోనే మందస ప్రాంతంలో అత్యధికంగా సారా కాస్తున్నారని, వీరికి నల్లబెల్లం సరఫరా చేయకుండా చూడాలని అధికారులు కోరారు. మందస కిరాణా వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వడ్డి గోపాల్, రమేష్, నరేష్, శ్రవణ్, మహేష్, శ్రీను, త్రినాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.